క్లుప్తంగా

గొలివివానిపేటలో విత్తన క్షేత్రం



విత్తన క్షేత్రం సిద్ధం చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరజాం పంచాయతీ గొలివివానిపేటలోని గొలివి లక్ష్మీ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం విత్తన సాగు చేపట్టారు. ఎచ్చెర్ల ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సువ్వారి సన్యాసిరావు పర్యవేక్షణలో 15 సెంట్లు భూమిలో గంటి, జొన్న, సజ్జలు, రాగులు, చిక్కుడు పలు రకాలు ఆకుకూరల విత్తనాలు నాటారు. ఈ విత్తనాలను ప్రకృతి వ్యవసాయ సాగుకు వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లీడ్ ఫార్మర్స్ మెట్ట ధనుంజయరావు, రాజేశ్వరి, యాదగిరి, హరేరామ్ పాల్గొన్నారు.

ఉమ్మడి వ్యవసాయ సంఘం అధ్యక్షుడిగా రాంబాబు



సంఘ కార్యవర్గ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరంలో ఉమ్మడి వ్యవసాయ సంఘం కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా యండ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా వేణుగోపాలరావు, మరో ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. జానకిరామ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.ను ఎన్నుకున్నారు. 83 మంది రైతులు హాజరయ్యారు.

కొత్తపేటలో మేలుకొలుపు



భజన గీతాలు ఆలపిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల: లావేరు మండలం కొత్తపేటలో ధనుర్మాసం సందర్భంగా శ్రీరామ మందిరం భజన మండలి ఆధ్వర్యంలో మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. వేకువజామున స్నానమాచరించి వీధుల్లో భజన గీతాలు ఆలపిస్తున్నారు.

పలకలు సరిచేశారు



భారతీనగర్‌కాలనీలో పలకలు సరిచేసిన దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరంలోని రిమ్స్ ఆస్పత్రి సమీపంలో భారతీనగర్ హడ్కోకాలనీకి కలుపుకొని ఉన్న కల్వర్టుపై పలకలు సరిగా లేక స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారని 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి పలకలు సరిచేశారు. సమస్య పరిష్కారమైనందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతి పండుగపై చర్చాగోష్టి



చర్చాగోష్టిలో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా దారిలో అయ్యప్ప కోవెల ప్రాంగణంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సంక్రాంతి పండుగపై చిన్నారులతో చర్చాగోష్టి నిర్వహించారు. నిర్వాహకులు లోకనాథం నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, హరి సత్యనారాయణ, డ్రాయింగ్ టీచర్ సాయి ప్రసాద్, సోదవరం ఈశ్వరరావు మాట్లాడుతూ పండుగ విశిష్టతను పిల్లలతో చెప్పించారు. అనంతరం మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

వెంకటస్వామికి సత్కారం



జ్యోతిషరత్న అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం: విశాఖపట్నంలో ఆదివారం విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞానసంస్థ ఆధ్వర్యంలో వైదిక జ్యోతిష సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వెంకటస్వామికి జ్యోతిషరత్న అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాలపర్తి శ్రీకాంత్‌శర్మ, పి.శ్రీనివాసరావు, ఐ.వెంకటగోపాలకృష్ణశర్మ, విజయ్‌సుబ్రహ్మణ్య సిద్ధాంతి, జొన్నలగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీమా ధీమా లేనట్టే!

- ముగిసిన పంటల బీమా ప్రీమియం గడువు
- 25 శాతం రైతులు మాత్రమే చెల్లింపు
- అవగాహన కల్పించడంలో పాలకులు విఫలం
- గత ప్రభుత్వంలో శతశాతం బీమా నమోదు

పంట	బీమా మొత్తం	రైతు చెల్లించాల్సిన మొత్తం(ఎకరాకు)
మినుము	రూ.20000	రూ.300
వరి	రూ.42000	రూ.630
రాగులు	రూ.16000	రూ.240
వేరుశనగ	రూ.32000	రూ.480
మొక్కజొన్న	రూ.38000	రూ.570
పెసలు	రూ.20000	రూ.300



సంచాంలో పంటల బీమా నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రణస్థలం: కూటమి పాలనలో రైతులకు ఏదీ కలిసి రావడం లేదు. ఇప్పటికే అకాల వర్షాలు వెంటాడగా.. ప్రస్తుతం రబీ సీజన్ సైతం అనుకూలంగా లేదనే భావన అన్నదాతలో బలంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన పాలకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని పెనుభారం మోపింది. రబీ సీజన్‌లో పండిస్తున్న వరి, మొక్కజొన్న, వేరుసెనగ, పెసలు, మినుములు వంటి పంటలకు రైతులు ప్రీమియం చెల్లిస్తేనే పంటల బీమా వర్తిస్తుందని కూటమి సర్కార్ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారంతో బీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రీమియం చెల్లింపునకు స్పందన అంతంతా మాత్రానే ఉంది. బీమా విషయమై అధికారులు అంతగా అవగాహన కల్పించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అవగాహన లోపం..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో లావేరు, జి.సిగడాం, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో పంటల బీమా ప్రీమియం చెల్లింపులు 25 శాతం మించలేదు. ఈ–క్రాప్‌లో నమోదైన ప్రతి పంటకు బీమా ప్రీమియం చెల్లింపు వర్తిస్తోంది. గతంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించడంతో శతశాతం పంటల బీమా నమోదు జరిగేది. నియోజకవర్గంలో పెసర, మినుము వంటి పంటలు 2500 ఎకరాల లోపు ఉండగా, మొక్కజొన్న 31వేల ఎకరాల్లో పంట వేశారు. ఇంత భారీగా పంటలు వేసినా కనీసం 25 శాతం ప్రీమియం చెల్లింపులు జరగకపోవడంపై రైతులకు అవగాహన లోపమేనని తేటతెల్లం అవుతుంది. ఈ విషయంలో వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా రైతులకు నష్టం కలిగేలా ఇటు అధికారుల తీరు.. అటు కూటమి ప్రభుత్వ ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. రైతుల సంక్షేమాన్ని కాలరాసి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న కూటమి సర్కారు.. ఎన్నికల ముందు రైతులకు రూ. 20వేలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికి నేటికీ ఆ విషయం పట్టించుకోకపోవడంపై అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

పాత పద్ధతి అమలు చేయాలి..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగానే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాను అమలు చేయాలి. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పూర్తిస్థాయి పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ సదుపాయం లేకపోవడంతో సాధారణ రైతాంగంతో పాటు కౌలు రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

– గొర్లె అప్పలనాయుడు,
రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, కొండములగాం

ప్రీమియం చెల్లించాలని చెప్పాం

క్షేత్రస్థాయిలో మా సిబ్బంది రైతులకు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని అవగాహన కలిగించాం. రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్నకు ప్రీమియం చెల్లింపు అంతంతమాత్రంగానే ఉంటుంది. అపరాలకు మాత్రమే కడుతున్నారు.

– శ్రీనివాసరావు,
వ్యవసాయశాఖ ఏడీఏ

రోడ్డుపైనే మురుగు



రణస్థలం మండలం మెంటాడ పంచాయతీ రెడ్డిక మెంటాడ గ్రామంలో మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. రహదారిపై గుంతలు ఏర్పడి వాడుక నీరు నిలిచిపోతోంది. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– రణస్థలం

పొంచి ఉన్న ప్రమాదం



ధవళపేట, సంతవురిటి గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్ల వద్ద గొయ్యిలు ఏర్పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వావానదారులు ఇప్పటికే ప్రమాదాల బారినపడ్డారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

– జి.సిగడాం

భక్తిశ్రద్ధలతో పాశుర పఠనం



పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక పాశుర పఠనం చేశారు. ధనుర్మాస ఉత్సవాలు సందర్భంగా నెల రోజుల పాటు గోదాదేవి శ్రీకృష్ణునిపై భక్తిని చాటుతూ స్వామివారిని మేలుకోమంటూ 21వ పాశురాన్ని పఠించారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



బఫే విధానంలో అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఆదివారం కావడంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక రంగవల్లులతో పాటు ఆదిత్యుని మూలవిరాట్టుకు ప్రత్యేకంగా తులసీదళాలతో అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచే సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనుమతించారు. పలువురు భక్తులు ఆదిత్యునికి మొక్కులుగా తలనీలాలను సమర్పించుకున్నారు. ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం, మంచినీరు పంపిణీ చేయించారు. ఆరోగ్యం కోసం పలువురు భక్తులు సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు.

బఫే విధానంలో అన్న ప్రసాదం..

అరసవల్లి ఆలయంలో నిత్యాన్నదాన పథకం అమల్లో ఉన్న సంగతి విదితమే. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పురాతన భవనాల కూల్చివేత పనులు జరుగుతున్న క్రమంలో అన్నప్రసాదాన్ని బఫే విధానంలో అన్నదాన మండపంలో అందజేశారు. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు ఈ అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ విధానం అరసవల్లి ఆలయ చరిత్రలో తొలిసారి అనే చర్చ జరిగింది. మరో రెండు రోజుల్లో వైజయంతి మండపం, టూరిజం డార్మిటరీ భవనంలో అన్నదాన ప్రసాద కార్యక్రమాలు చేపట్టనున్నారని ఆలయ వర్గాలు తెలియజేశాయి.

1673 హెక్టార్లలో పంట నమోదు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలో 2024–25 సంవత్సరానికి గాను 1673 హెక్టార్లల్లో పంట నమోదు(ఈ–క్రాప్) చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 370 హెక్టార్లలో మొక్కజొన్న, 718 హెక్టార్లలో మినప, 405 హెక్టార్లలో పెసర, 102 హెక్టార్లలో సోడి, 14 హెక్టార్లలో వేరుశనగ, 15 హెక్టార్లలో ఉలవ, 39 హెక్టార్లలో వరి, 20 హెక్టార్లలో కట్టి జనుమును రైతులు సాగు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

లక్ష్య సాధనవైపు అడుగులు వేయాలి



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో వీసీ రజనీ

శ్రీకాకుళం న్యూకాలనీ: యువత సమయం వృథా చేసుకోకుండా నిర్దేశించుకున్న లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజనీ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బొందిలీపురంలో ఉన్న రైజ్ అకాడమీలో శిక్షణ పొంది ఎస్ఎస్‌సీ జీడీ–2024 కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు ఎంపికైన 30 మంది అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్లు బాబ్జీ, బాలు, హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు హనుమంతు పోలినాయుడు, ఇంగ్లీషు ఫ్యాకల్టీ ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల :మండలంలోని ముద్దాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావును ఆదివారం కాకినాడలో ప్రారంభమైన 17వ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన 30 వేల మంది ఉపాధ్యాయుల నడుమ సన్మానం అందుకోవడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

సత్యసాయి భజన మండలి ఆర్థిక సాయం



రమాదేవికి నగదు అందజేస్తున్న సభ్యులు

గార: మండల కేంద్రంలోని కుమ్మరిపేటకు చెందిన కుమ్మరి రమాదేవి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని బోరవానిపేట సత్యసాయి భజన మండలి సభ్యులు రూ.35వేలు సాయాన్ని ఆదివారం అందజేశారు. రమాదేవి చికిత్స కోసం ఇప్పటికే రూ.10 లక్షలు ఖర్చు చేశారు. మరింత మంది దాతలు వచ్చి ఆదుకోవాలని భజన మండలి సభ్యులు కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ నరసింహా రౌలే, సేవాదళ్ కన్వీనర్ బి.సింహాచలం మాస్టర్, ఎంపీటీసీ ఆరంగి చిన్నబాబు, మాజీ ఎంపీటీసీ జల్లు రాజీవ్‌ల, బి.రాజేశ్వరరావు, కె.శేఖర్, కె.రాజారావు, బి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతలను తెలియజేయడానికి నగరంలోని పలు ప్రాంతాలలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతలో అంశాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు దుర్గారావు, వెంకటరావు, రామకృష్ణ, అప్పన్న, వాసుదేవరావు, లక్ష్మి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



సరస్వతిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఓరియంటల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్ శ్రీకాకుళం శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఇలపండ సరస్వతి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సరస్వతిని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బి.హేమచంద్, కె.ఎస్.రామకృష్ణ, కె.ఎస్.ఆర్.మూర్తి, కుటుంబ సభ్యులు ఆదివారం సత్కరించారు. ఆత్మీయ సత్కారంలో ఓరియంటల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఎం.రామారావు, స్వాతి, డాక్టర్ ఐఎస్ దేవీప్రసాద్, చాందిని తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి



శాస్త్రవేత్త సంతోష్ బొద్దానను సత్కరిస్తున్న కళాశాల నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కాళాశాలలో ఆదివారం బీసీఏ ఇంటర్నల్ ఫెస్ట్ (ఆక్షి టూకె –ట్వంటీఫైవ్) ఘనంగా నిర్వహించారు. బోష్ కంపెనీ సీనియర్ డేటా సైంటిస్ట్ సంతోష్ బొద్దాన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో కంప్యూటర్ అనేది ప్రతి మనిషి జీవితంలో భాగమైందని, ఈ రంగంలో మరెన్నో నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు నాంది పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు, లెక్చరర్లు, బీసీఏ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లకు వచ్చేదెవరు?



ఎచ్చెర్ల ఎంపీడీఓ కార్యాలయం

- హడలిపోతున్న ఎంపీడీఓలు
- సెలవులో వెళ్లిపోతున్న అధికారులు
- ఇన్‌చార్జి బాధ్యతలకు కూడా ముందుకు రాని పరిస్థితి

ఎచ్చెర్ల క్యాంపస్:

ఎచ్చెర్ల మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వర్తించేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. శ్రీకాకుళం నగర పాలక సంస్థకు సరిహద్దు మండలం, శ్రీకాకుళంలో ఉంటూ విధులు నిర్వహణకు అనువైన మండలంన శ్రీకాకుళం పట్టణ కేంద్రానికి 10 కిలోమీటర్లు లోపు దూరమే అయినప్పటికీ ఇక్కడికి ఎంపీడీఓగా పనిచేసేందుకు ఎవరూ ముందుకురావడం లేదు. కనీసం ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకునేందుకు సైతం ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

రెగ్యులర్ ఎంపీడీవోగా పనిచేసిన సీపాన హరిహరరావు గత నెల 29 నుంచి సెలవు పెట్టారు. ఈ నెల 10 వరకు సెలవులు కొనసాగినా.. తర్వాత మరికొన్నాళ్లు సెలవు పెట్టాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. సాధారణంగా రెగ్యులర్ ఎంపీడీవో సెలవు పెట్టేటప్పుడు కార్యాలయం పరిపాలన అధికారి, ఈవోపీఆర్‌డీ వంటి వారికి ఇన్‌చార్జి బాధ్యతులు అప్పగిస్తున్నారు. వీరు సైతం ఇన్‌చార్జి(ఎఫ్ఏసీ)గా ఉండేందుకు ఇష్టపడటం లేదు. ఈ నెల 1న రణస్థలం ఎంపీడీవో ఎం.ఈశ్వరరావుకు ఎచ్చెర్ల మండల ఎంపీడీఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సైతం బాధ్యతలు తీసుకునేందుకు ఆసక్తి చూపించడం లేదని సమాచారం.

వెనుకడుగు ఎందుకంటే..

ఎంపీడీఓలు ఎచ్చెర్ల వచ్చేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని సర్వత్రా చర్చ సాగుతోంది. ఎచ్చెర్ల మండలానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.7.76 కోట్లతో 124 పనులు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ నిబంధనలు మేరకు గ్రామ పంచాయతీ తీర్మానం, మండల పరిషత్ తీర్మానాలకు అనుగుణంగా పనులకు పాలనా ఆమోదం ఇవ్వాలని అధికారులకు మండల స్థాయి ప్రజా ప్రతినిధి స్పష్టం చేశారు. అయితే ఈ ప్రతిపాదనలకు కాకుండా నియోజకవర్గ ప్రజాప్రతినిధి అందజేసిన జాబితాకు జిల్లా స్థాయి అధికారులు పాలనా ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఈ పనులకు ఎంవోయూ పత్రాలపై ఎంపీడీవో సంతకం చేసి వర్కర్స్ కమిటీలకు అందజేయాల్సి ఉంటుంది. అనంతరమే పనులు ప్రారంభిస్తారు. అయితే ఎంవోయూపై సంతకం చేసేందుకు ఎంపీడీవో ముందుకు రావడం లేదు. దీనికి కారణం పనుల నిబంధనలు, పంచాయతీరాజ్ చట్టాలు ఉల్లంఘనపై గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవ్వడమే. ఉన్నతాధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధి తప్పించుకునే అవకాశం ఉండగా.. వర్క్ ఆర్డర్ల మంజూరు, ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసే ఎంపీడీఓ బాధ్యత వహించాల్సి ఉంటుంది. కొన్నేళ్ల పాటు కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి రావచ్చు. నిబంధనలు అమలు, కోర్టు చుట్టూ తిరగడం, ఇతర సాంకేతిక సమస్యలు కారణంగా ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపటం లేదు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఎంపీడీఓ నియామకానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

గార: గోరువానిపేట సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో ఆదివారం నారాయణ సేవ నిర్వహించారు. శ్రీకూర్మం జంక్షన్, అంపోలు జంక్షన్ వద్ద పేద కుటుంబాలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టామని మండల యూత్ కో ఆర్డినేటర్ ఆదినారాయణ, నాయుడు తెలిపారు.

బీజేపీవి మతవాద రాజకీయాలు

శ్రీకాకుళం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతవాద రాజకీయాలు చేస్తోందని, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుడిచిపెట్టి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తోందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డేపల్లి నరసింహులుని ఆదివారం శ్రీకాకుళంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి జాతీయ యువజన వారోత్సవాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వామి వివేకానంద 163వ జయంతి వేడుకల్లో భాగంగా ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జాతీయ యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీశారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణారావు ఆదివారం తెలిపారు. సరుబుజ్జిలి మండలంలో ఉత్సవాలు ప్రారంభమై శ్రీకాకుళంలో ముగుస్తాయని పేర్కొన్నారు.